
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
శనివారం 3 ఫిబ్రవరి 2024
జిల్లాల వార్తలు



రుణాల మంజూరులో
## రాష్ట్రంలోనే మెదక్ జిల్లా ఫస్ట్
- లక్ష్యం రూ.491.74 కోట్లు, గతనెల 30 నాటికి వందశాతం పంపిణీ
- అధికారులకు మెదక్ కలెక్టర్ అభినందన

7లో



# రూ.5.79 కోట్లు
### పేరుకుపోయిన ప్రభుత్వ శాఖల ఆస్తి పన్ను బకాయిలు
- జీతాలు చెల్లించలేని స్థితిలో మెదక్ బల్దియా
- డిమాండ్ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు

మెదక్, జనవరి 2 : ప్రభుత్వ సంస్థలు ప్రతీఏటా ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో బకాయిలు కోట్లలో పేరుకుపోతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి పన్నులు చెల్లించడంలో ససేమిరా అంటున్నాయి. ఆ ప్రభావం అభివృద్ధి కార్యక్రమాలపై పడుతోంది. నీటి సరఫరా లోపం తలెత్తితే మరమ్మతులు, వాహనాల రిపేర్లు తదితర అత్యవసర పనులు చేపట్టడానికి నిధులు ఉండడం లేదు. సిబ్బంది జీతభత్యాలను కూడా చెల్లించలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. కలెక్టరేట్‌తో పాటు ఎస్పీ, హెడ్ పోస్టాఫీస్, మున్సిఫ్ కోర్టు, జడ్పీ, పట్టణ పోలీస్‌స్టేషన్, రెవెన్యూ, పశుసంవర్థక శాఖ, జిల్లా అటవీశాఖ, పంచాయతీరాజ్, ఎస్సీ, ఆర్అండ్‌బీ ప్రభుత్వ శాఖల కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వ శాఖల నుంచి రూ.5.79 కోట్ల పన్నులు రావాల్సి ఉన్నది. పన్ను చెల్లింపుల్లో మొండికేస్తున్న ప్రభుత్వ సంస్థలకు మున్సిపల్ అధికారులు డిమాండ్ నోటీసు ఇచ్చి చేతులు దులుకుంటున్నారు. తదుపరి చర్యలకు వెనకడుగు వేస్తున్నారు. పోస్టల్ శాఖ కార్యాలయం అత్యధికంగా రూ.98.55 లక్షలను చెల్లించాల్సి ఉంది. మున్సిపల్ అధికారులు పోస్టల్ శాఖకు ఇప్పటికే డిమాండ్ నోటీసును అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు వారి లక్షల్లో పేరుకుపోయాయి. మెదక్ పట్టణంలోని కోదండ రామాలయం షాపింగ్ కాంప్లెక్స్ ప్రాపర్టీ టాక్స్ రూ.14.13 లక్షలు బకాయి రావాల్సి ఉంది.

**ప్రభుత్వ సంస్థల బకాయిలు**

| ప్రభుత్వ శాఖ | పన్ను (లక్షల్లో) |
|---|---|
| పోస్టల్ శాఖ | రూ.98.55 |
| బీఎస్ఎన్ఎల్ | రూ.73.29 |
| పీఆర్ ఎస్సీ శాఖ | రూ.20.11 |
| ఆర్అండ్‌బీ గెస్‌హౌజ్ | రూ.19.12 |
| జడ్జి క్వార్టర్లు | రూ.16.02 |
| జిల్లా అటవీ శాఖ | రూ.11.90 |
| మెదక్ పోలీస్‌స్టేషన్ | రూ.10.51 |
| ఎస్పీ కార్యాలయం | రూ.7.77 |
| కలెక్టరేట్ | రూ.5.10 |
| ఐసీడీఎస్ పీడీ | రూ.1.36 |

**డిమాండ్ నోటీసులు ఇచ్చాం**



మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయల ఆస్తి పన్ను పెండింగులో ఉంది. దీంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోంది. బకాయిలు ఉన్న ప్రభుత్వ సంస్థలకు డిమాండ్ నోటీసులిచ్చాం. త్వరితగతిన బకాయిలు వసూలైతే స్థానిక సంస్థలు ఆర్థికంగా పరిపుష్టి చెందుతాయి. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా పన్ను బకాయిలు పూర్తిస్థాయిలో వసూలు చేసేలా ప్రణాళిక రూపొందించనున్నాం.

-జానకీ రాంసాగర్, మున్సిపల్ కమిషనర్, మెదక్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 2 : నారాయణఖేడ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో చేరింది. ఇక్కడి ఛైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, వైస్‌ఛైర్మన్ అహీర్‌పరశురాంపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో నారాయణఖేడ్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నుంచి చేజారింది. ముగ్గురు మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇటీవల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, శుక్రవారం అవిశ్వాసం సమావేశానికి రెండు గంటల ముందు మొదటి వార్డు కౌన్సిలర్ ఫుటాల కవితావిఠల్ హస్తం గూటికి చేరుకున్నారు. దీంతో మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులున్న మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం 11కు చేరుకున్నది. వాస్తవానికి ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు 8 మంది, బీఆర్ఎస్‌కు ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. అప్పట్లో ఎక్స్ అఫీషియో సభ్యుల బలంతో బీఆర్ఎస్ బల్దియా పీఠం దక్కించుకున్నది.



మున్సిపల్ సమావేశంలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు

# ఖేడ్ కాంగ్రెస్ పరం
### నెగ్గిన అవిశ్వాసం.. బల్దియా పీఠం చేజార్చుకున్న బీఆర్ఎస్
- సమావేశానికి ముందు హస్తం గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్
- ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి 18 మంది సభ్యులు
- హాజరైన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- ఎంపీ బీబీ పాటిల్, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్ల గైర్హాజరు

**అనుకూలంగా 13 మంది..**

శుక్రవారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మానంపై ప్రిసైడింగ్ అధికారి, స్థానిక ఆర్డీవో వెంకటేష్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో 15 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులైన జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిపి 18 మంది సభ్యులయ్యారు. 12 మంది హాజరైతే కోరం ఉన్నట్లు లెక్క. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు దారం శంకర్, రాజేష్‌చౌహాన్, నర్సింలు, ఫర్హానాబేగం, లక్ష్మీబాయి, మాజీద్, వివేకానంద్, ఆనంద్ స్వరూప్‌షెట్కార్, బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సంధ్యారాణి, మాజీద్, కవితతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలిపి 13 మంది నిర్ణీత సమయానికి హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎక్స్ అఫీషియో సభ్యుడు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్వప్నఅభిషేక్ షెట్కార్, పరశురాం, రుబీనాబేగం, నూర్‌జహాన్‌బేగం హాజరు కాలేదు. మున్సిపాలిటీలో కోరం ఉండడంతో ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన ఆర్డీవో వెంకటేష్ సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన 13 మంది అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, సీడీఎంకు నివేదిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద డీఎస్పీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు విద్యాచరణ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



ఆర్డీవో రవీందర్‌రెడ్డికి అవిశ్వాస తీర్మానం అందజేస్తున్న జిన్నారం మండల బీఆర్ఎస్ ఎంపీటీసీలు

## కాంగ్రెస్‌కు అవిశ్వాస గండం
### జిన్నారం ఎంపీపీపై బీఆర్ఎస్ అస్త్రం
- ఆర్డీవోకు నోటీసు అందజేసిన ఎంపీటీసీలు
- గతంలో లాటరీ పద్ధతిలో పదవి

జిన్నారం, ఫిబ్రవరి 2 : కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాష్ట్రంలో ఆ పార్టీ మద్దతుతో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్, ఎంపీపీ అధ్యక్షుడి స్థానాలపై అవిశ్వాలు కొనసాగుతుండగా సంగారెడ్డి జిల్లా జిన్నారంలో మాత్రం సీన్ రివర్స్ ఉంది. జిన్నారంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీపై బీఆర్ఎస్ సభ్యులు అవిశ్వాస అస్త్రం ప్రయోగించారు. మండల పరిషత్‌లో కాంగ్రెస్‌కు 4, బీఆర్ఎస్‌కు 4 ఎంపీటీసీల బలం ఉండగా లాటరీ పద్ధతిలో కాంగ్రెస్ సభ్యుడు రవీందర్‌గౌడ్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇద్దరు కాంగ్రెస్ ఎంపీటీసీలు బీఆర్ఎస్‌లో చేరగా, ఒక బీఆర్ఎస్ ఎంపీటీసీ కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో సంఖ్య పరంగా బీఆర్ఎస్‌కు ఐదుగురు సభ్యుల బలం ఉన్నది. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఐదుగురు, కాంగ్రెస్‌కు ముగ్గురు ఎంపీటీసీలున్నారు. రవీందర్‌గౌడ్‌ను పదవి నుంచి దించేసి అధికార కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇవ్వాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ అవిశ్వాసం ప్రకటించింది. ఈ వ్యవహారంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో మండలంలో చర్చనీయాంశంగా మారింది.

**ఆర్డీవోకు నోటీసు అందజేసిన ఎంపీటీసీలు**

సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డికి శుక్రవారం ఐదుగురు ఎంపీటీసీలు అవిశ్వాస నోటీసును అందజేశారు. ఎంపీపీపై అవిశ్వాసం ప్రతిపాదన కోసం సమావేశం నిర్వహించాలని వారు ఆర్డీవోను కోరారు. నోటీసు అందజేసిన వారిలో జిన్నారం ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఊట్ల ఎంపీటీసీ గంగు రమేష్, కాజీపల్లి ఎంపీటీసీ ఆకుల భార్గవ, సోలక్‌పల్లి ఎంపీటీసీ స్వాతి ప్రభాకర్‌రెడ్డి, శివానగర్ ఎంపీటీసీ సంతోష ఉన్నారు.

# ఈవీఎం యూనిట్ల తనిఖీ
- 5 నుంచి ఫిబ్రవరి 14 వరకు..
- ఈసీఎల్ కంపెనీ నుంచి ఇంజనీర్లు
- పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలన
- అన్ని ఏర్పాట్లు చేయాలి : మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2 : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 5 నుంచి ఈవీఎం ఫస్ట్ లెవెల్ చెక్(ఎఫ్ఎల్‌సీ) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈసీఎల్ సంస్థకు చెందిన ఏడుగురు ఇంజనీర్లు ఈవీఎంలను పరిశీలించనున్నారు. 10 టేబుళ్లలో ప్రతీరోజు ఎఫ్ఎల్‌సీ జరగనున్నది.

**సమస్యలు ఉంటే కొత్తవి..**

ఈవీఎం యూనిట్ల తనిఖీ చేసేందుకు ఫస్ట్ లెవెల్ చెక్ ప్రక్రియ ఈనెల 5 నుంచి మొదలై 14 వరకు కొనసాగుతుంది. రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో దాదాపు 1000 ఈవీఎం యూనిట్ల తనిఖీలు చేయనున్నారు. ఈవీఎంకు సంబంధించిన బీయూ, సీయూ, వీవీ ప్యాట్ మూడు కలిపి ఒకేసారి తనిఖీ చేస్తారు. అన్ని మెషీన్లు కరెక్ట్‌గా పనిచేస్తున్నాయని గుర్తించి యూనిట్ సంతృప్తిస్థాయిలో ఉందని ముద్రవేస్తారు. సమస్యలు గుర్తిస్తే వాటి స్థానంలో కొత్త యూనిట్‌లను జిల్లాకు కేటాయిస్తారు.

**క్షుణ్ణంగా పరిశీలించాలి : కలెక్టర్**

మొదటిస్థాయి పరిశీలనను క్షుణ్ణంగా చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. శుక్రవారం అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు భద్రతపరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో గదులను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో తదితరులు

## నర్సాపూర్‌లో 'మెదక్' కౌంటింగ్
### స్ట్రాంగ్‌రూంల ఏర్పాటును పరిశీలించిన మెదక్ కలెక్టర్

నర్సాపూర్, ఫిబ్రవరి 2: మెదక్ పార్లమెంటు పరిధిలోని ఓట్ల లెక్కింపును నర్సాపూర్‌లోనే నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిసింది. మెదక్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, పటాన్‌చెరు, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటన్నింటికీ నర్సాపూర్ మధ్యలో ఉంటుంది. గత పార్లమెంటు ఎన్నికల్లోనూ అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ ఇక్కడే నిర్వహించారు. ఈసారి నర్సాపూర్‌లోనే కౌంటింగ్ నిర్వహించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం మెదక్ కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాల, గిరిజన గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. ఈవీఎంలను కౌంటింగ్ వరకు భద్రపరచడానికి ఏర్పాటు చేయాల్సిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు.

## త్వరలో పెళ్లి.. యువతిని తీసుకెళ్లిన యువకుడు
### ఆగ్రహంతో ఇంటికి నిప్పు పెట్టిన యువతి కుటుంబీకులు

శివ్వంపేట, ఫిబ్రవరి 2: మరికొన్ని రోజుల్లో వివాహం చేసుకోబోతున్న తమ కుమార్తెను ఓ యువకుడు ప్రేమ పేరిట మాయ మాటలు చెప్పి తీసుకెళ్లాడని ఆరోపిస్తూ యువతి కుటుంబసభ్యులు సదరు యువకుడి ఇంటికి నిప్పు పెట్టారు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దొంతి గ్రామానికి చెందిన ఒకరు తన కుమార్తె వివాహం ఈ నెల28న చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆమెను ప్రేమించిన ప్రశాంత్ అనే యువకుడు విషయం చెప్పకుండా యువతిని ఇంటి నుంచి తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన యువతి కుటుంబసభ్యులు ఆగ్రహంతో ఊగిపోతూ శుక్రవారం ప్రశాంత్ ఇంటికి వెళ్లి నిప్పటించారు. ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇళ్లంతా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణ, ఎస్ఐ రవికాంత్‌రావుతో పాటు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువతి వివాహానికి సుమారు రూ.పది లక్షల అప్పు చేసి ఏర్పాట్లు చేయగా, ఇలా జరగడంతో యువతి కుటుంబీకులు ఆగ్రహంతో ఇలా చేశారని స్థానికులు అంటున్నారు.



తగులపెట్టిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

## గంజాయి సాగు చేస్తే ఆస్తుల సీజ్
- మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి చర్యలు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 2 : గంజాయి సాగు చేసే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా వారి ఆస్తులను కూడా సీజ్ చేస్తామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా ఎస్పీ రూపేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యువత, విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాటిని సమూలంగా అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను ఏర్పాటు చేసి మత్తుపదార్థాల ఉనికి లేకుండా చేయాలన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు.

**అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేయండి**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. అట్రాసిటీ కేసులు దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి గడువులోగా చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితులకు అందించే ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించేలా చూడాలని, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతంలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు.

**సీఎస్ఆర్ నిధులు విద్యా, వైద్య, శిశు సంక్షేమానికి..**

జిల్లాలో విద్యా వైద్యం, మహిళా శిశు సంక్షేమానికి అవసరమైన సదుపాయాల కల్పనకు సీఎస్ఆర్ నిధులను వెచ్చించాలని కలెక్టర్ క్రాంతి అధికారులకు సూచించారు. సంబంధిత క్లస్టర్ అధికారులు వారి పరిధిలోని అర్హత గల పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ కింద సంక్షేమానికి నిధులు వెచ్చించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో గాయత్రి, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి, సీసీవో మోహన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.350 కోట్లతోనే సరి
- బడ్జెట్‌లో మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్‌కు నిధులు
- ఇప్పటికే సిద్దిపేట వరకు 76కిలోమీటర్ల లైన్ పూర్తి
- ఇంకా 75కి.మీ.ల పనులపై కసరత్తు
- తాజా బడ్జెట్‌తో కొత్తపల్లి చేరడం కష్టమే

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 2: మనోహరాబాద్ కొత్తపల్లి రైల్వేలైను నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. 2016లో మొదలైన పనులు నేటికీ పూర్తికాలేదు. 151 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వేలైనులో ఇప్పటికీ సగం లైను మాత్రమే పూర్తయింది. కేంద్రం కొసిరికొసిరి నిధులు వడ్డిస్తుండడం కూడా జాప్యానికి కారణం. తాజా బడ్జెట్‌లో రూ.350 కోట్లు ఈ రైల్వేలైను నిర్మాణానికి కేటాయించడం శుభపరిణామమే అయినప్పటికీ ఈ నిధులతో కొత్తపల్లి దాకా చేరడం అసాధ్యంగా భావించాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ నుంచి సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల మీదుగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు చేపట్టిన రైల్వేలైను నిర్మాణానికి తాజా బడ్జెట్‌లో రూ.350 కోట్లు కేటాయించారు. 2016-17లో రూ.1,160 కోట్ల అంచనాతో ఈ లైనుకు శంకుస్థాపన చేశారు. ఇందులో మూడోవంతు వాటాతో పాటు ఉచితంగా భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. ఇప్పటికే భూసేకరణ పూర్తయ్యింది. 151 కి.మీ.లలో 76 కి.మీ.ల లైను ఏర్పాటు కావడంతోపాటు సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు రైలు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇక సిద్దిపేట నుంచి కొత్తపల్లి వరకు 75కి.మీ.ల లైను నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. ఇది పూర్తయితేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.



మనోహరాబాద్ - కొత్తపల్లి రైల్వేలైన్

**నేటికీ ఒక్కటే రైలు**

గత అక్టోబరు 3 నుంచి సిద్దిపేట-సికింద్రాబాద్ నడుమ రైలు రాకపోకలు ప్రారంభమయ్యాయి. నిత్యం సిద్దిపేట నుంచి రెండుసార్లు రైలు బయల్దేరుతుంది. అయితే సిద్దిపేట నుంచి తిరుపతి, మైసూరు, బెంగళూరుకు రైలు సర్వీసులు నడిపిస్తారని అప్పట్లో చర్చ జరిగింది. కానీ నేటికీ ఒక్క రైలుతోనే సరిపెడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో తిరుపతికి వెళ్తుంటారు. వీరంతా సికింద్రాబాద్, వరంగల్, కరీంనగర్ రైల్వేస్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి నుంచే తిరుపతికి రైలు సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. రైలు సర్వీసు ప్రారంభించి 4 నెలలు పూర్తి కాగా ఎక్స్‌ప్రెస్‌రైలు సౌకర్యాన్ని ఈ మార్గంలో నడిపించాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కేసీఆర్ నియోజకవర్గంలోని గురుకులంలో అన్నీ సమస్యలే..
- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- తూప్రాన్‌లోని గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

తూప్రాన్, ఫిబ్రవరి 2: పదేళ్ల రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రాతినిధ్యం వహించిన కేసీఆర్ నియోజకవర్గంలోని గురుకులంలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ పట్టణంలోని గురుకుల పాఠశాల, కళాశాలను మంత్రి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన పాత 35 గురుకుల పాఠశాలల్లో ఒకటైన ఈ పాఠశాల దుస్థితి చూసేందుకే తాను వచ్చానని తెలిపారు. ఇందులో అదనపు తరగతుల సమస్య ఉందని, హాస్టల్‌లోకి కుక్కలు వస్తున్నాయని, బెడ్స్, గార్మెంట్స్ లేవని, తాగునీటి సమస్యతోపాటు ప్రహరీ కూలిపోయిందని వివరించారు.

**సదుపాయాలపై పొన్నం అసంతృప్తి**

గురుకుల విద్యాలయం ఆవరణ శుభ్రంగా లేకపోవడం, విద్యార్థుల వసతి, తరగతి ఒకే గదిలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజామొహియుద్దీన్, తహసీల్దారు విజయలక్ష్మిని పిలిపించి గురుకుల విద్యాలయం సమస్యలపై ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కొందరు విద్యార్థులు చెట్ల కింద చదువుతుండటంపై ఆయన ఆరా తీశారు. స్పందించిన మంత్రి వెంటనే అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతోపాటు, రెసిడెన్షియల్ స్కూల్స్ కమిషనర్ రమణకుమార్, మెదక్ కలెక్టర్ రాజర్షిషాతో ఫోన్‌లో మాట్లాడారు. గురుకుల విద్యాలయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని వారిని ఆదేశించారు. తాగునీటి సౌకర్యంతోపాటు వాటర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విద్యాలయంలో వాటర్‌ప్లాంటు మరమ్మతు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ సొంతంగా రూ.50 వేలను సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. భోజన సిబ్బంది, వాచ్‌మెన్‌లను మంత్రి సన్మానించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు కలిశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడి మృతి


శ్రీకాంత్(ఫైల్)

పాపన్నపేట, ఫిబ్రవరి 2: ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతిచెందాడు. మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన పల్లె శ్రీకాంత్(20) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మిత్రుడు హరీశ్‌తో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం స్నానం చేసేందుకు వనదుర్గా ప్రాజెక్టు లోకి దిగి నీట మునిగిపోయాడు. మిత్రుడు హరీశ్ కాపాడేందుకు యత్నించినా సాధ్యపడలేదు. స్థానికులకు, కుటుంబీకులకు సమాచారమందించాడు. స్థానికుల సహాయంతో గాలించగా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మధ్యాహ్నం మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## పటేల్‌గూడలో అనుమతి లేని ఇళ్లు కూల్చివేత


అనుమతులు లేని ఇళ్లను కూల్చివేస్తున్న పంచాయతీ సిబ్బంది

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లను పంచాయతీ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. గ్రామంలోని రాజరాజేశ్వరీ కాలనీలో అనుమతులు లేకుండా ఇళ్లను నిర్మిస్తున్నారని అధికారుల దృష్టికి రావడంతో చర్యలకు ఉపక్రమించారు. మండల పంచాయతీ అధికారి రాజ్‌కుమార్ నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు. అనుమతులు లేని 11 ఇళ్లను ధ్వంసం చేశామని తెలిపారు. ఇప్పటికే అనుమతులు లేని ఇళ్లను గుర్తించి నోటీసులు సైతం జారీ చేశామన్నారు.

# 'పది'లో శత శాతం ఫలితాలు సాధించాలి

● మెదక్ కలెక్టర్ రాజర్షిషా


ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2: చదువు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు సూచించారు. శుక్రవారం టీఎన్జీవో భవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి.. పదో తరగతి వసతి గృహ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారికి వివిధ పాఠ్యాంశాలపై తర్ఫీదు, మనోధైర్యం, వ్యక్తిగత నైపుణాన్ని పెంచేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లచే తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో భయం, ఉత్సాహం ఉంటుందని, తమ లక్ష్యాన్ని సాధించే దిశగా చదువుపై దృష్టి సారించాలన్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులందరూ పేదరికం నుంచి వచ్చిన వారేనని, చదువుతో మీ భవిష్యత్‌ను మార్చుకొని మీ వంశ వృక్షంలో ఒక మలుపు దిశగా అడుగులు వేస్తూ ముందుకుసాగాలని కలెక్టర్ సూచించారు. వార్డెన్లు విద్యార్థులను ఉదయం నిద్ర లేపి చదివించాలని, పరీక్షల సమయంలో క్రమశిక్షణగా ఉండేలా వసతి గృహ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. పదో తరగతిలో శత శాతం ఫలితాలు లక్ష్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్, డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు, వసతి గృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుధాలపై పోలీసు సిబ్బంది పరిజ్ఞానం పెంచుకోవాలి

● మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి


ఫైరింగ్ చేస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2: పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా ఎస్పీ డా.బాలస్వామి సూచించారు. మోబిలైజేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట స్టేషన్ పరిధిలో రెండురోజులుగా చేయిస్తున్న ఫైరింగ్ ప్రాక్టీస్‌ను శుక్రవారం ఎస్పీ సందర్శించి, ఫైరింగ్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృత్తి నైపుణాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్, డీఎస్పీలు, సాయుధ దళ డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి మరణంతో మనస్థాపం.. యువకుడి ఆత్మహత్య


అనిల్‌రెడ్డి (ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 2: తల్లిచనిపోయిందని మనస్థాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన అనిల్ రెడ్డి(27) తల్లి రుక్మిణీ కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి అనిల్ కుమిలిపోతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కల్వర్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం, యువకుడి మృతి


శ్రీనివాస్(ఫైల్)

బెజ్జంకి, ఫిబ్రవరి 2: కల్వర్టును ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన బండిపెల్లి శ్రీనివాస్(25) పని నిమిత్తం ద్విచక్ర వాహనాన్ని తీసుకుని వెళ్లాడు. గ్రామ శివారులోని గుండారం వెళ్లే దారిలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కిందపడిన శ్రీనివాస్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి పరశురాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

# పారబోస్తున్న పాల పైసలెట్లిస్తరు?

- డైయిరీ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- రైతుల ఆరోపణలకు చేకూరుతున్న బలం
- చేర్యాల బీసీయూలో కొనసాగుతున్న కల్తీ తతంగంపై అనుమానాలు


చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం


పాల కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

చేర్యాల, ఫిబ్రవరి 2: పాలసేకరణలో ఓ వెలుగు వెలుగొందిన సిద్దిపేట జిల్లా చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం నేడు వివాదాల సుడిగుండంలో చిక్కుకుపోయింది. రైతులకు మేలు చేయాల్సిన డైయిరీ అధికారులే 'నేల' పాలు' చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమన్వయంతో గతంలో పాల ఉత్పత్తిలో రాష్ట్రస్థాయిలోనే ఆదర్శంగా నిలిచినా ఇరువర్గాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధాన్ని తలపిస్తూ విజయ డైయిరీ ప్రతిష్ఠకు భంగం కలిగించే పరిస్థితి నెలకొన్నది.

చేర్యాల బీసీయూ(బల్క్ బిల్డింగ్ యూనిట్) పరిధిలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాల్లో 48 సొసైటీల ద్వారా నిత్యం 9-10వేల లీటర్లు, అత్యల్పంగా 5-6వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. ఎల్ఆర్ శాతం మేరకు ఆవు పాలు లీటరుకు రూ.40-50, గేదె పాలు లీటరుకు రూ.41-84 వరకు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో వెన్నశాతం అధికంగా వస్తే అధిక ధర పొందొచ్చని పలువురు రైతులు పాలల్లో ఉప్పు, చక్కర కలిపి కల్తీ చేస్తున్నారని డైయిరీ అధికారులు చెబుతున్నారు. ఇదే కారణం పేరిట కొద్దిరోజులక్రితం ఓ ట్యాంకర్ పాలను తిప్పి పంపడంతో చాలామంది రైతులకు నష్టం వాటిల్లడం వివాదానికి దారితీసింది. అయితే కేంద్రానికి చేరిన పాలను బల్క్ టెస్టింగ్ కాకుండా క్యాన్లవారీగా టెస్టింగ్ చేస్తే ఏ ఊరు రైతులు కల్తీచేశారో ప్రాథమికంగా నిర్ధారణ జరగడంతో పాటు ఎలాంటి తప్పు చేయని ఇతర రైతులకు నష్టం జరగదు. కానీ గతనెలలో రెండురోజులపాటు సుమారు 75 క్యాన్ల పాలు నేలపాలు చేశారు. ఈ విషయమై ఇతర రైతులు అధికారుల తీరును తప్పుబడుతూ ఆందోళన చేపట్టారు.


పారబోస్తున్న పాలు(ఫైల్)

అవగాహన లేని వ్యక్తితో టెస్టింగ్ చేస్తున్నారని ఆరోపించడంతో సిద్దిపేట నుంచి సిబ్బందిని రప్పించి రైతుల వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా పాలుపితికి పరీక్షలు జరపడంతో ఎలాంటి తేడా రాలేదు. దీంతో ఖంగుతిన్న డైయిరీ అధికారులు క్యాన్లవారీగా టెస్టింగ్ చేపట్టడంతో కల్తీ పరిస్థితి కాస్త మారిపోయింది. కానీ తాజాగా మూడురోజులుగా ధూళిమిట్ట రైతుల పాలను రిజెక్ట్ చేయడంతో కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టడం, నష్టపోయిన పాల డబ్బులు ఇస్తామని డీడీ గోపాల్‌సింగ్ చివరకు హామీఇవ్వడం మరోమారు వివాదం తెరమీదకు వచ్చింది.

### ఎక్కడా లేనివిధంగా ఇక్కడే సమస్య

ఇతర ప్రాంతాల్లో ఎక్కడాలేని విధంగా బీసీయూలో వివాదాలు కొనసాగుతుండటంతో రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్ ఆపరేటర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం, ఎప్పటికప్పుడు సెంటర్లను పర్యవేక్షించకపోవడం, పాల ఉత్పత్తికి సంబంధించి రైతులకు సూచనలు ఇవ్వకపోవడం, టెస్టింగ్ పట్ల అవగాహన లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతుందని చెబుతున్నారు.

### పాలసేకరణ తగ్గింపు కోసమేనా?

మహారాష్ట్ర నుంచి రూ.25కు లీటరుపాలు లభ్యమవుతుండటంతో ఇక్కడి రైతులపాలు అధికధరకు ఎందుకు కొనుగోలు చేయాలన్న యోచనతో కల్తీ తతంగం నడిపిస్తూ డైయిరీ ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్థానిక అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కుంటున్నారు. అందుకే ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

### పారబోసిన పాలకు ఎవరి జేబులోంచి పైసలిస్తరు?

హైదరాబాద్ డైయిరీకి పంపించిన పాలకు మాత్రమే డబ్బులు చెల్లించాలన్నది నిబంధన. కొద్దిరోజుల క్రితం రిజెక్ట్ అయిన ట్యాంకర్ పాల నష్టం రైతులందరిపై మోపారు. కానీ గతనెలలో తిరస్కరించిన 75 క్యాన్ల పాల డబ్బులను రైతులకు అందిస్తామని బీఎంసీ ఇన్‌చార్జి హామీఇవ్వగా, రెండురోజుల క్రితం తిరస్కరించిన పాల డబ్బులు చెల్లిస్తామని డీడీ గోపాల్‌సింగ్ హామీఇచ్చారు. నేలపాలు చేసినా పాల డబ్బులను ఎలా సర్దుబాటు చేస్తారని ఎవరికి వారుగా భిన్న ప్రకటనలు చేస్తుండటం పట్ల సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు, డైయిరీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బీసీయూలో నెలకొన్న వివాద పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

## త్రిపుర అభివృద్ధి చెందిన రాష్ట్రం

- అలాంటి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేయడం సంతోషం
- గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 2: త్రిపుర అభివృద్ధి చెందిన రాష్ట్రమని, అలాంటి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేయడం సంతోషకరమని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన పౌర సన్మానం కోసం హైదరాబాద్ నుంచి జగిత్యాలకు వెళ్తుండగా మార్గమధ్యలో సిద్దిపేట పట్టణంలోని ఆయన పాత స్నేహితుడు బీజేపీ సీనియర్ నాయకుడు వంగ రామచంద్రారెడ్డి ఇంట్లో అల్పాహారం చేసి విలేకరులతో మాట్లాడారు. త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలా ఎడ్యుకేషన్ మెడికల్ హబ్‌గా ఉన్నదని తెలియజేశారు. త్రిపుర చిన్న రాష్ట్రం అయినప్పటికీ అనేక రకాలుగా అభివృద్ధి చెందిందని చెప్పారు. అలాంటి రాష్ట్రానికి మిత్రులందరూ రావాలని కోరారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఇంద్రసేనారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

## కుష్ఠు నిర్మూలనపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2: కుష్ఠు నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు(డీపీఎం) మారుతి, ప్రతాప్‌గౌడ్ సూచించారు. కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని సెయింట్ ఆర్నాల్డ్స్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శలేని మచ్చలుంటే కుష్ఠు లక్షణాలుగా భావించవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. అనంతరం కుష్ఠు వ్యాధిని కలిసికట్టుగా నిర్మూలించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఆశల పూత

- పూతకు వస్తున్న మామిడితోటలు
- 13 వేల ఎకరాల్లో సాగు ● భయపెడుతున్న వాతావరణం


నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో మామిడి తోటలో పూతను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సునీత


సిద్దిపేట జిల్లా నంగునూరులో పూతతో ఉన్న మామిడి తోట

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 2: నాలుగేళ్లుగా వరుస నష్టాల్లో ఉన్న మామిడి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఆలస్యంగానైనా జిల్లాలో మామిడి తోటలు పూతకు వస్తున్నాయి. జనవరి చివరి వారానికల్లా పూర్తిస్థాయి పూత రావాల్సి ఉండగా, ప్రస్తుతం 50 శాతం చెట్లు పూతపట్టాయి. జిల్లాలో 13వేల పైగా ఎకరాల్లో మామిడితోటలు సాగు చేస్తున్నారు. బంగినపల్లి, దసేరి, చెరుకురసాలు, తోతాపరితో పాటు పలు రకాల మామిడి పండ్లు జిల్లాలో సాగవుతాయి. అయితే, వాతావరణంలో మార్పులు రైతులను ఒకింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. రోజుల తరబడి మబ్బులు పట్టి, పొగ మంచు కమ్ముకుంటుండటంతో చీడపీడల దాడి ఉధృతమవుతుందన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. గతేడాది తీవ్రంగా నష్టపరిచిన పండు ఈగ ఉనికి కలవర పెడుతోంది. దీంతో చీడపీడల నుంచి రక్షించుకునేందుకు వేల రూపాయలు ఖర్చు పెట్టి మందులు పిచికారి చేస్తున్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి పూతను సంరక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### ఎంత చలి ఉంటే.. అంత పూత

పూత వచ్చే సమయంలో వాతావరణ పరిస్థితులు అధిక ప్రభావాన్ని చూపుతాయి. ఎంత చలి ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా పూత వచ్చే అవకాశం ఉంటుంది. రాత్రి పూట 15 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే మెరుగైన ఫలితాలుంటాయి. పూత దశలో నీటితడులు నిలిపివేసి.. బెట్ట పరిస్థితులు కల్పిస్తే శాఖీయ పెరుగుదల నిలిచిపోయి మొక్కకు తగినంత విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల చెట్టు పూత సమయానికి సరిపడా పిండి పదార్థం నిల్వ చేసుకోవడమే కాకుండా కొమ్మలు పూర్తి పక్వతకు చేరుకుని ఎక్కువ పూత రావడానికి దోహదపడతాయి. పూమొగ్గ ఏర్పడిన తరువాత నీటి తడులిచ్చి పైపాటుగా ఎరువులు వేసుకోవాలి. చెట్టు వయసును బట్టి సాధారణంగా 500 గ్రాముల నుంచి ఒక కిలో యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. పూత బటానీ గింజ సైజు అయ్యేంత వరకు మందులు పవర్ స్ప్రేయర్‌తో పిచికారి చేస్తే పూత రాలిపోయే అవకాశం ఉంది. ఇంకా పూత కనబడని చెట్లపై మల్టీ కే 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి చెట్టుపై పిచికారి చేయాలి. బోరాన్ లోపం ఉన్న తోటల్లో బోరాక్స్ 2 గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి స్ప్రే చేస్తే పిందెకట్టు పెరుగుతుంది. పూత సమయంలో తేనె మంచు పురుగు, తామరు పురుగు, ఆకుచుట్టు, పూత చుట్టు, పిండి నల్లి పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. అవి ఆశించినట్లు గుర్తించిన వెంటనే తగిన మందులు స్ప్రే చేసుకోవాలి.

### పూత దశే కీలకం

మామిడి పంటలో పూత దశ కీలకం. సున్నితమైన ఈ దశలో చర్యలు చేపట్టి పూతను రక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారులంటున్నారు. తెగుళ్లపై అవగాహన పెంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పూత సమయంలో తేనె మంచు పురుగు, తామరు పురుగు, ఆకుచుట్టు, పూత చుట్టు, పిండి నల్లి పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. ఆకుజల్లెడ పురుగు (బల్లి పాతర) చెట్లపై లేకుండా చూసుకోవాలి. తెగుళ్ల ఆశించినట్లు గుర్తించిన వెంటనే తగిన మందులు స్ప్రే చేయాలి. ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్ల కూడా మామిడి చెట్లపై దాడి చేస్తాయి. ఈ తెగుళ్ల వల్ల దిగుబడిపై ప్రభావం పడుతుంది. సస్యరక్షణ చర్యలు చేపడుతూనే ఎండలు ముదురుతున్నా కొద్ది క్రమం తప్పకుండా నీటి తడులు ఇస్తే మామిడిలో పూత, పిందె రాలకుండా ఉంటుంది.

### విరగబూసిన మామిడి పూత

శివ్వంపేట, ఫిబ్రవరి 2: మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చండీ గ్రామ శివారులో దుశాంత్‌రెడ్డి పంట పొలంలోని మామిడి చెట్టుకు పూత విరగబూసింది. చెట్టు నిండా కొమ్మ కనిపించనంతగా పూత పూయడంతో స్థానికులను ఆకట్టుకుంటున్నది.


దొంతిలో విరగబూసిన మామిడిపూత

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మామిడి తోటలు పూతకు వస్తున్నాయి. వచ్చిన పూతలో ఎక్కువ శాతం పిందె కట్టకుండానే రాలిపోతుండటంతో రైతులు నష్టపోతున్నారు. మామిడి పూతలో ప్రతి పూల గుత్తిలో 4వేల నుంచి 6 వేల పూలు ఉంటాయి. ఇవన్నీ మగపూలే. ఇందులో 1-3 పూలే కాయగా వృద్ధి చెందుతాయి. పూత సంరక్షణలో వాతావరణ పరిస్థితులు, నీటి, పోషక యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల బెడద, హార్మోన్ల లోపాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. పూత దశలోనే తెగుళ్లను గుర్తించి మందులు స్ప్రే చేసుకోవాలి. సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపడితే పూతను రక్షించుకొని, ఆశించిన దిగుబడులు సాధించవచ్చు. ఎలాంటి సమస్యలున్నా ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

- భాస్కర్‌రెడ్డి, ఉద్యాన అధికారి, సిద్దిపేట

## పాతపంటల వినియోగంతోనే ఆరోగ్యం: డీడీఎస్


పొట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన జాతరలో పాల్గొని మాట్లాడుతున్న డీడీఎస్ మహిళా రైతు మొగులమ్మ

ఝరాసంగం, ఫిబ్రవరి 2: పాతపంటల వినియోగంతోనే అందరం ఆరోగ్యంగా ఉంటామని డీడీఎస్ జాతర కోఆర్డినేటర్ వినయ్‌కుమార్, డీడీఎస్ మహిళా రైతులు మొగులమ్మ, గ్రామపెద్దలు పేర్కొన్నారు. డీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న 24వ పాత పంటల జాతర శుక్రవారం మండలంలోని పొట్టిపల్లి గ్రామానికి చేరుకున్నది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ చిరుధాన్యాలు క్రమేపీ గ్రామాల్లో కనుమరుగవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. దీంతో 24 ఏళ్లుగా చిరుధాన్యాలను వినియోగించాలని, పంటలను పండించాలని కోరుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలను, రైతులను చైతన్యం చేస్తున్నామన్నారు. చిరుధాన్యాలను ప్రతిరోజు ఆహారంలో తీసుకుంటే పోషకాలు లభించడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అందులో భాగంగా గ్రామంలో చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు రాందాస్, మాణిక్‌పాటిల్, శివప్రసాద్, మల్లికార్జున్, బాల్‌రాజ్, డీడీఎస్ మహిళా రైతులు, జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్, మంజుల, పూలమ్మ, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, చంద్రమ్మ, కమలమ్మ, జనరల్ నర్సమ్మ, మొగులమ్మ, బాలయ్య, సురేష్ పాల్గొన్నారు.

## బిలాల్‌పూర్‌లో ఐదెకరాల అరటి తోట దగ్ధం

- రూ.30 లక్షల నష్టం


తగలబడిపోయిన అరటి తోట

కోహీర్, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని బిలాల్‌పూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఐదెకరాల అరటి తోటను తగలబెట్టారు. గ్రామానికి చెందిన రైతు కోహీర్ రాచయ్య ఐదు ఎకరాలలో అరటి తోటను సాగు చేశాడు. అయితే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దీనిని తగలబెట్టారు. అంతేకాకుండా రూ.2 లక్షల విలువ గల డ్రిప్ పైపులను కూడా కాల్చేశారు. ఈ ఘటనలో మొత్తం రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌తో పాటు తహసీల్దార్, ఉద్యానవనశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు రాచయ్య కోరాడు.

## రెయిలింగ్‌కు ఢీకొన్న బైక్, ఇద్దరి మృతి


మహ్మద్(ఫైల్)


ఆరిఫ్(ఫైల్)

మెదక్ అర్బన్/శివ్వంపేట, ఫిబ్రవరి 2: రోడ్డు సైడ్ రెయిలింగ్‌కు బైక్ ఢీకొని ఇద్దరు మృతిచెందిన సంఘటన కొల్చారం మండల పరిధిలోని లోతువాగు వద్ద శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండల కేందానికి చెందిన ఆరిఫ్(50), మాజీ వార్డుసభ్యుడు మహ్మద్(55) బైక్‌పై కౌడిపల్లి నుంచి కొల్చారం వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సైడ్ రెయిలింగ్‌కు ఢీకొన్నారు. ఆరిఫ్ అక్కడికక్కడే మృతిచెందగా. మహ్మద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు.

## వివాహిత అదృశ్యం


లావణ్య(ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 2: వివాహిత అదృశ్యమైన సంఘటన కాళ్లకల్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పెద్దింటి శివరాజ్ భార్య లావణ్య(26) ఈనెల 31న ఉదయం 8 గంటలకు కాళ్లకల్‌లోని ఫ్యాన్ కంపెనీకి వెళ్తున్నాని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం మామ పెద్దింటి యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రుణాల మంజూరులో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా ఫస్ట్

- లక్ష్యం రూ.491.74 కోట్లు, గతనెల 30 నాటికి వందశాతం పంపిణీ
- అధికారులకు మెదక్ కలెక్టర్ రాజర్షిషా అభినందన

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2: స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల పంపిణీలో మెదక్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.491.74 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా.. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 8,148 సంఘాలకు రుణాల అందజేసి.. గతనెల 30 నాటికి 100 శాతం పూర్తిచేసింది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ప్రారంభం నుంచి మెదక్ జిల్లాలో వందశాతాన్ని మించి రుణాలు అందించడం ఇదే మొదటిసారి. రుణాల మంజూరులో జిల్లా ప్రథమస్థానంలో నిలువడం పట్ల కలెక్టర్ రాజర్షిషా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను అభినందించారు.

## దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో ఆదర్శ పాఠశాల నమూనాకు ఐదోస్థానం


విద్యార్థిని నందినికి ప్రశంసాపత్రం, అవార్డు అందజేస్తున్న దృశ్యం

రాయికోడ్, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయవాడలో గతనెల 27 నుంచి జరుగుతున్న దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల విద్యార్థిని నందిని తయారుచేసిన నీటిని పీల్చే కాంక్రీట్ రహదారుల నమూనా ఐదోస్థానంలో నిలిచింది. గురువారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో నందినికి ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందజేశారు. వైజ్ఞానిక ప్రదర్శనకు దక్షిణ భారతదేశం నుంచి 33 ప్రదర్శనలు ఎంపిక కాగా.. అందులో నందిని తయారుచేసిన నమూనా (సోకింగ్ రోడ్స్) ఐదోస్థానంలో నిలిచింది. దీంతో ప్రిన్సిపాల్ రజినికుమారి, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. నందినికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన సంధ్యారాణిని అభినందించారు.

## జిల్లా సైన్స్ అధికారిగా సిద్ధారెడ్డి



సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2: జిల్లా సైన్స్ అధికారిగా పి.సిద్ధారెడ్డిని నియమించినట్లు జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌటకూర్ మండలం కోర్పోల్ జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్)గా పనిచేస్తున్న ఆయనను జిల్లా సైన్స్ అధికారిగా నామినేట్ చేసినట్లు పేర్కొన్నారు. గణితం పట్ల అమితమైన ఆసక్తి, పరిజ్ఞానంతో ఉన్న సిద్ధారెడ్డి తన ఇంటిలోనే గణిత ప్రయోగశాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు.

## 'వీఆర్ఏల వారసుల జీవో అమలు చేయాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 2: 60 సంవత్సరాలకు పైబడిన వీఆర్ఏల వారసుల నియామకానికి సబంధించిన జీవోను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం వీఆర్ఏలు ఖేడ్ తహసీల్దార్ దేవిదాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,797 మంది వీఆర్ఏల వారసులకు విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్ క్యాడర్‌లుగా నియామకపు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. గతేడాది జూలై 24న ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ఇప్పటికైనా ఆ జీవోను అమలు చేసి, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వారు కోరారు.

# అరకొర వసతులతో చదివేదెలా?

- పెద్దచింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తరగతి గదుల కొరత
- అసంపూర్తిగా ఉన్న భవనంలోనే తరగతుల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



అసంపూర్తిగా ఉన్న భవనాల కింద కొనసాగుతున్న తరగతులు

నర్సాపూర్, ఫిబ్రవరి 2: వసతుల లేమితో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొర సౌకర్యాల మధ్యనే చదువులు సాగుతున్నా పట్టించుకునే వారు లేరు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సమస్యలు తీరుతాయన్న ఆశతో విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. నర్సాపూర్‌కు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 2017లో మంజూరు కాగా కొన్ని రోజులు నర్సాపూర్ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. ఆ తర్వాత పెద్దచింతకుంట వద్ద నిర్మించిన కొత్త భవనంలోకి మార్చారు. నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఒకటే ఉండడంతో నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారు. కాలేజీలో ఇంగ్లిషు, తెలుగు మీడియంలో క్లాసులు కొనసాగుతుండగా మొత్తం 250 మంది విద్యార్థులున్నారు. వీరికి సరిపడా సౌకర్యాలు, గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8 గదులు మాత్రమే ఉండగా వాటిలో గ్రంథాలయం, ప్రయోగశాల, కంప్యూటర్ ల్యాబ్, ప్రిన్సిపాల్ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. దీంతో తరగతుల నిర్వహణకు గదులు సరిపోవడం లేదు. కేవలం 4 గదుల్లోనే తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అదనపు గదుల కోసం రూ.40లక్షలు మంజూరై, టెండరు ప్రక్రియ పూర్తయినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. అంతకుముందు చేపట్టిన పనులను కూడా కాంట్రాక్టర్ అసంపూర్తిగానే వదిలేసి వెళ్లాడు. అసంపూర్తిగా ఉన్న భవనాల్లోనే తరగులు నిర్వహిస్తున్నారు. కాగా డిగ్రీ కాలేజీ జాతీయ రహదారికి పక్కనే కేటాయించిన 4 ఎకరాల స్థలంలో నిర్మించారు. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో పాటు, పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో కొందరు కాలేజీ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్నారు. ఈ విషయమై గతంలో స్థానిక సర్పంచుగా ఉన్న శివకుమార్ కూడా ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా గత ప్రభుత్వంలోని అధికారులు, అప్పటి ఎమ్మెల్యే పరిష్కరించలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా పరిష్కారమవుతుందేమోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

## మాజీ మంత్రి హరీశ్‌రావును అడ్డుకుంటాం

- టీపీసీసీ ప్రతినిధి సుప్రభాత్‌రావు



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రతినిధి సుప్రభాత్‌రావు

రామాయంపేట, ఫిబ్రవరి 2: మెదక్ నియోజకవర్గం అభివృద్ధి చెందకుండా సర్వనాశనం చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఈ ప్రాంతంలో తిరిగితే అడ్డుకుంటామని టీపీసీసీ ప్రతినిధి సుప్రభాత్‌రావు హెచ్చరించారు. శుక్రవారం రామాయంపేటలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఎన్నికల కోసం హడావిడిగా ప్రొసీడింగ్‌లను ఇచ్చి కుల సంఘాలను సైతం తప్పుదోవ పట్టించిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిర్లక్ష్యం వల్లే నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. సమావేశంలో ఎనిశెట్టి అశోక్, స్వామి, అల్లాడి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి హామీ' ఆవిర్భావ దినోత్సవం



నస్తీపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

హత్నూర, ఫిబ్రవరి 2: హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్, గుండ్లమాచునూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏర్పాటు చేసి 17సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉపాధి హామీ కూలీల చేత కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. ఉపాధి హామీ పథకంతో ఎంతో మంది నిరుపేదలు జీవనోపాధి పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో ప్రవీణ్‌కుమార్, ఈసీ ప్రమోద్ కుమార్, టీఏ ప్రసాద్, పంచాయితీ కార్యదర్శులు రమణారెడ్డి, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు సాయిలు, విజయ్ కుమార్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపీ సీటు ఇవ్వండి

సంగారెడ్డి రూరల్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం సాయంత్రం బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మెదక్ ఎంపీ బీఆర్ఎస్ టికెట్‌ను తనకు ఇవ్వాలని బీరయ్య యాదవ్ కోరారు.

### బ్లాస్టింగ్ చేస్తున్నారని ఫిర్యాదు

శివ్వంపేట: మండలంలోని దొంతిలో తమకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి శుక్రవారం రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 626లో గ్రామానికి చెందిన మల్లమ్మ, వెంకటేశ్, యాదగిరి, లక్ష్మన్, లక్ష్మీ, అనితకు ప్రభుత్వం గతంలో సాగుభూమి ఇచ్చింది. అయితే ఆ భూమిలో కొందరు అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

### నేడు మంత్రి పర్యటన

రేగోడు: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం రేగోడు మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దిగంబర్‌రావు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రూ.కోటి 75 లక్షల నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఆర్ ఇటిక్యాల్ గ్రామంలో శ్రీ శాంతప్ప మహరాజ్ ఆరాధన ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

### గ్రామానికి వైకుంఠ రథం అందజేత

చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామ పంచాయతీకి దేవి పరిశ్రమ యాజమాన్యం శుక్రవారం వైకుంఠ రథాన్ని అందజేసింది. ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో గిరిదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, పంచాయతీ కార్యదర్శి సుహాసినికి వైకుంఠ రథాన్ని దేవి పరిశ్ర ప్రతినిధి అప్పగించారు. గర్గ్ స్టీల్ పరిశ్రమ ఫ్రీజర్‌ను అందజేసింది.

### అలరించిన ప్రదర్శనలు

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని సంస్కార్ విద్యాలయంలో గురువారం రాత్రి నిర్వహించిన లార్క్ ఉత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులు రామాయణం, మహాభారతంలోని పలు అంశాలను నాటకాల రూపంలో ప్రదర్శించారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్ పాల్గొన్నారు.



# గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

- కార్మిక సంఘాల పిలుపు

జిన్నారం, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు వరప్రసాద్‌రెడ్డి, రాజయ్య, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, నాగిరెడ్డి, గోవింద్‌రెడ్డిల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమవడంతో పాటు కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కేంద్రంలోని బీజేపీ గద్దె దించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అందులో భాగంగానే 16న దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ బంద్‌ను అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.



బొల్లారంలో నిర్వహించిన సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న వివిధ యూనియన్ల నాయకులు

### దేశవ్యాప్త సమ్మెకు సహకరించండి

జహీరాబాద్: ఈ నెల 16న సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో గల పరిశ్రమల యాజన్యాలకు, ప్రభుత్వ అధికారులకు సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నదని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కార్మికులందరూ సమ్మెబాట పడుతారని హెచ్చరించారు.



జహీరాబాద్ ఎంవీఐ జయప్రకాష్‌రెడ్డికి సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

## కొనుగోలు కేంద్రాలను తెరిపించండి

- డీఆర్‌వోకు సీపీఎం నాయకుల వినతి



డీఆర్‌వోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 2: సీసీఐ కొనుగోలు కేంద్రాలను తెరిపించి రైతులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీఆర్‌వో నగేష్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మూసివేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిపించి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,55,802 ఎకరాల్లో సుమారు 3,55,802 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయిందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సీసీఐ ద్వారా 1,10,674 మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారని, ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.6వేల నుంచి రూ.7వేలు చెల్లించి 20,816 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారని అధికారుల లెక్కలు చెబుతున్నాయన్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుని సీసీఐ కేంద్రాలు తెరిపించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, నాయకులు అశోక్, శివ తదితరులు ఉన్నారు.

## 'యాదవుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం'

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2: యాదవుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, యాదవుల మద్దతుతోనే మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గొర్రెల యూనిట్ల పంపిణీతో యాదవ కుటుంబాలు, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించిందన్నారు. ఈ సందర్భంగా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కే.సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ.అఫ్జల్ పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 2: రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. వారం రోజుల క్రితం మెదక్-చేగుంట రహదారిపై టి.మాదాపూర్ రాంజీతండా వద్ద రెండు బైకులు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో కొరివిపల్లితండాకు చెందిన నేనావత్ శాంతి(45) తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

- డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 2: డ్వాక్రా సంఘాలతో మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా మగ్గం వర్కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామంలో డ్వాక్రా మహిళలకు నాబార్డు ద్వారా మగ్గం వర్కులో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మగ్గం అల్లికలతో మహిళలు ఆర్థికాభివృద్ధిలో ముందుకు సాగుతున్నారని చెప్పారు. మహిళలకు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తామని చెప్పారు. ఆ సర్టిఫికెట్లతో బ్యాంకు లోన్లు కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనారాయణ, వీవో లీడర్లు పాల్గొన్నారు.

## పాపన్నపేట ఎస్ఐగా నరేష్

పాపన్నపేట, ఫిబ్రవరి 2: పాపన్నపేట ఎస్ఐగా నరేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు మిరిదొడ్డిలో విధులు నిర్వహించిన నరేష్ బదిలీపై పాపన్నపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల రక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

# టెన్త్‌లో ఉత్తీర్ణతను పెంచేందుకు చొరవ చూపాలి



రెడ్డిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

- ఉపాధ్యాయులకు డీఈవో రాధాకిషన్ సూచన

చేగుంట, ఫిబ్రవరి 2: పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, నార్సింగి మండలం శేరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాల్లో ఏవైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. హాజరు శాతం పెంచడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రెడ్డిపల్లి ప్రధానోపాధ్యాయురాలు గంగుబాయి, ఉపాధ్యాయులు మధుసూధన్‌రావు, దేవయ్య, నాగరాజు, మంజులత, పద్మ, శేరిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు తిరుపతి, జగన్నాథ్, యాదగిరి, రాజు, మాధవి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ స్వామి ఉన్నారు.

### కష్టపడి చదివితేనే ఫలితం

జహీరాబాద్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఆశించిన ఫలితం లభిస్తుందని మండల విద్యాధికారి బస్వరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు. 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలన్నారు.

# ప్రజా శ్రేయస్సు కోసం తపాలా సేవలు

- తపాలా శాఖ సంగారెడ్డి సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీర్ డి.శ్రీనివాస్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 2: ప్రజల శ్రేయస్సు కోసం తపాలా శాఖ అనేక సేవలు అందిస్తున్నదని తపాలా శాఖ సంగారెడ్డి సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీర్ డి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని తపాలా శాఖ కార్యాలయంలో పెద్దశంకరంపేట సబ్ ఆఫీస్‌కు వచ్చిన ఖాతాదారులకు లాభాదాయకమైన పోస్టల్ పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. తపాలా శాఖ ద్వారా ప్రవేశ పెట్టిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తపాలా శాఖ జీవిత బీమా పాలసీలను పెంచేందుకు బీపీఎంలు, సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దశంకరంపేట ఎస్‌పీఎం రఘు, బీపీఎం ప్రశాంత్, గంగారాం, మాణయ్య, సిబ్బంది తుకారం, సుదర్శన్, సవిత, తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో తపాలా శాఖ సేవల గురించి వివరిస్తున్న శ్రీనివాస్

## రోడ్డు నియమాలపై అవగాహన

జహీరాబాద్, ఫిబ్రవరి 2: రోడ్డుభద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం మాడ్గిచౌరస్తా వద్ద వాహనదారులకు రోడ్డు నియమాలపై జహీరాబాద్ ఎంవీఐ జి.వి.శ్రీనివాస్‌గౌడ్ అవగాహన కల్పించారు. డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడిపితే కుటుంబాలు రోడ్డున పడుతాయనే విషయాన్ని వాహనాల డ్రైవర్లు దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలుంటాయని హెచ్చరించారు.

## రేపు 'మన గుండె పదిలం'పై అవగాహన



కార్డియాలజిస్ట్ అనిల్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2: హోప్ కార్డియాక్ అండ్ న్యూరో హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 4న సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో 'మన గుండె పదిలం- సేఫ్ హార్ట్ సంగారెడ్డి' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి కార్డియాలజిస్ట్ అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ రూపేష్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మందికి గుండె సంబంధిత వ్యాధులు, జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతరత్ర కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో ఈ అవగాహన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

## ఈ నెల 19న సెలవు ప్రకటించాలి

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 2: ఈ నెల 19న ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించాలని మండల పరిధిలోని కారముంగి, మాజీ సర్పంచ్ అనితగుండేరావు, నాయకులు అనిల్‌పటేల్, తదితరులు శుక్రవారం డిమాండ్ చేశారు.

## క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పూజలు



క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 2: నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీతారెడ్డి రెండు నెలల తర్వాత ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయానికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయంలోకి ప్రవేశించారు. శుక్రవారం తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి భవనంలోకి వచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్ పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల పరిశీలన

రామాయంపేట, ఫిబ్రవరి 2: రామాయంపేటలో కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 3,594 విద్యార్థులతో పాటు ఒకేషనల్ విభాగంలో 1,130 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. అలాగే విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి ఉన్నారు.

## చెరువులు, కుంటలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

హత్నూర, ఫిబ్రవరి 2: చెరువులు, కుంటలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని దౌల్తాబాద్ సబ్ డివిజన్ డీఈ రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం హత్నూర మండలం శేర్కాన్‌పల్లి శివారులోని పాత చెరువులో ఓ వ్యక్తి మట్టితో పూడ్చుతున్న విషయం తెలుసుకున్న అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు, కుంటల శిఖం భూములు ఆక్రమించినా, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టినా, చెరువు, కుంటల్లో నుంచి మట్టి తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈ భూపుత్ర ఉన్నారు.

## లెక్చరర్ కొట్టడంతో విద్యార్థికి గాయాలు

హత్నూర, ఫిబ్రవరి 2: మండల కేంద్రమైన హత్నూర గురుకుల కళాశాలలో నరేశ్ ఎంఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం తరగతి గదిలోని బోర్డుపై పరీక్షలకు సంబంధించిన అంశం రాయడంతో కోపోద్రిక్తుడైన తెలుగు లెక్చరర్ హరి విద్యార్థి కాలిపై కర్రతో బలంగా కొట్టడంతో చర్మం చితికి రక్తం వచ్చింది. విద్యార్థికి ప్రథమ చికిత్స అందించినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కకుండా విద్యార్థికి లెక్చరర్ చేత క్షమాపణ చెప్పించినట్లు సమాచారం. విద్యార్థికి ప్రథమ చికిత్స చేయించామని, లెక్చరర్‌పై చర్యలు తీసుకోనున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ స్పష్టం చేశారు.

## 'నూతన వంగడాలతో అధిక దిగుబడులు'

కౌడిపల్లి, ఫిబ్రవరి 2: వ్యవసాయంలో నూతన వంగడాలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని తునికిలోని డాక్టర్ రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యా కళాశాల అడ్వయిజరి కమిటీ చైర్మన్ అచ్యుతరాంప్రసాద్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త వంగడాలను అధికంగా ఉత్పత్తి చేయడాన్ని విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. పండించిన ధాన్యం మార్కెట్‌కు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, సైంటిస్టులు రవి కుమార్, శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది జగదీష్ పాల్గొన్నారు.

## వరినాటే యంత్రంపై క్షేత్రస్థాయిలో అవగాహన

శివ్వంపేట, ఫిబ్రవరి 2: మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో యంత్రం ద్వారా వరి నాటు వేసే విధానాన్ని శుక్రవారం క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏవో లావణ్య మాట్లాడుతూ.. రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తే ఖర్చు తక్కువ కావడమే కాకుండా సమయం కూడా కలిసి వస్తుందన్నారు. దిగుబడి కూడా పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మజీద్ పాల్గొన్నారు.

## పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం

నర్సాపూర్/రామాయంపేట/కౌడిపల్లి/గుమ్మడిదల, ఫిబ్రవరి 2: పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీ కాలం ముగిసినందున పెద్దచింతకుంట సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శివకుమార్, ఉపసర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు గ్రామాభివృద్ధికి పాటుపడ్డ తీరును కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్, బాలమణి, నాగభూషణం పాల్గొన్నారు. రామాయంపేట మండలంలోని అన్ని గ్రామాల సర్పంచును రామాయంపేటలో ఎంపీపీ భిక్షపతి, ఎంపీడీవో ఉమాదేవి సన్మానించారు. కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో పాలకవర్గ సభ్యులను సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ సుజాతకాంతరావు, మాజీ ఉపసర్పంచ్ సాలమ్మరాములు, మాజీ వార్డు సభ్యులు పోచయ్య, భూమయ్య, బాగయ్య, ఏక్బల్, ముర్కత్ పాల్గొన్నారు. గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు శుక్రవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు.

## రైతు సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- బీకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముదిగంటి శ్రీధర్‌రెడ్డి



రైతులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న బీకేఎస్ నాయకులు

పుల్‌కల్, ఫిబ్రవరి 2: చౌటకూర్ మండలంలోని చక్రియాల, శివంపేట, వెండికోలు, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి గ్రామాల్లో శుక్రవారం బీకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముదిగంటి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు కనీస మద్దతు ధరను ప్రకటించినప్పటికీ, జిన్నింగ్ మిలుల యాజమానులు చెల్లించడం లేదని ఆరోపించారు. వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, చెరుకు, సోయాబిన్ పంటలకు కనీస మద్దతు ధరను మరింతగా పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడూ నిలబడి కలబడుతున్న బీకేఎస్‌లో రైతులు సభ్యులుగా చేరాలని శ్రీధర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సదానందారెడ్డి, కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు తిమ్మారెడ్డి అనంతరాంరెడ్డి, సంఘం నాయకులు మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నర్సింహ్మారెడ్డి, అంజిరెడ్డి, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.